# 8

# సృష్టిని గురించి క్రైస్తవులేమని నమ్ముచున్నారు

మనం చూస్తున్న ఈ భౌతిక సృష్టి అంతా ఎలా ఉనికిలోనికి వచ్చింది? ఇదంతా ఎక్కడ నుండి వచ్చింది లేదా అది అంతకుముందు నుండే వున్నదా? ఈ భౌతిక విశ్వం యిప్పుడే ఉనికిలోనికివచ్చిందా, ఇంతకు మునుపెన్నడు లేదా? ఇది జీవములోయున్నదా కొన్ని శక్తులు దీని మనుగడ సాగిస్తున్నాయా. ఈ ఆత్మలన్ని రాళ్ళల్లో రప్పల్లో చెట్లల్లో గాల్లో జంతువుల్లో దాగియున్నాదా? ఈ సృష్టిని గురించి మనం స్పష్టంగా ఏమి నమ్ముచున్నాం?

ఏదేమైనా క్రైస్తవులు మాత్రం బైబిల్ ఏమి బోధిస్తుందో దానినే నమ్ముచున్నారు సుమా! ఒక మాటల్లో సంక్షిప్తంగా చెప్పాలంటే, *ఈ విశ్వమంతయు దేవుని ద్వారా సృష్టించబడినదే, ఆయన మహిమార్థం సృష్టించబడినదే. ఈ భౌతిక విశ్వం ఏదో ఒక రోజు అంతం కావలసిందే.* సృష్టిని గురించి ఆరు ముఖ్యమైన విషయాలను బైబిలు ప్రస్తావిస్తుంది.

### ప్రపంచం, భౌతిక విశ్వం, దేవుని ద్వారా సృష్టించబడింది[1]

“ఆదియందు దేవుడు భూమ్యాకాశములను సృజించెను” (ఆదికాండము 1:1) అనే మాటలతో బైబిలు ప్రారంభమవుతుంది. ఆ తర్వాత ఆరు రోజుల్లో తక్కిన సృష్టిని చేయడం గురించి చివరకు ఆయన అదంతా[2] “మంచిదని” దేవుడన్నాడు (ఆదికాండము 1:31). ఏడవ దినమున దేవుడు విశ్రాంతి తీసుకున్నాడంటు బైబిల్ ఆదికాండము 2వ అధ్యాయంలో చెప్పుతుంది. ఆతర్వాత ఆరవ దినమున మానవాళిని సృష్టించడం గురించిన వివరాలున్నాయి.

ఆదికాండము 1 మరియు 2 అధ్యాయాలవరకే సృష్టి నిర్మాణ వివరణ పరిమితమై యుండలేదు, వాస్తవానికది మిగతా బైబిలు కథ కంతటికి కావలిసిన ఆధారాన్ని చూపిస్తుంది. దేవుడు సృష్టిని సృష్టించాడని సృష్టంచేస్తూన్న వివరణలు తరచుగా పాత నిబంధన తెల్పుచున్నది. లేవీయులు యిలా ప్రార్థించారు, “నీవే, అద్వితీయుడవైన యెహోవా, నీవే ఆకాశమును మహాకాశములను వాటి సైన్యమును, భూమిని దానిలో ఉండునది అంతటిని, సముద్రములను వాటిలో ఉండునది అంతటిని, సృజించి వాటినన్నిటిని కాపాడువాడవు. ఆకాశ సైన్యమంతయు నీకే నమస్కారము చేయుచున్నది” (నెహెమ్యా 9:6). కీర్తనలు 33:6ల్లో చూచినట్లయితే “యెహోవా వాక్కు చేత ఆకాశములు కలిగెను ఆయన నోటి ఊపిరిచేత వాటి సర్వసమూహము కలిగెను” (కీర్తనలు 33:9; 90:2; యెషయా 45:18; యిర్మీయా 10:12, 16).

దేవుడు ఈ సృష్టినంతటిని చేశాడని క్రొత్త నిబంధన కూడ అదే విధంగా చెబుతోంది:

> “ఆదియందు వాక్యముండెను, వాక్యము దేవునియొద్ద వుండెను, వాక్యము దేవుడై యుండెను. సమస్తమును ఆయన మూలముగా కలిగెను, కలిగియున్నదేదియు ఆయన లేకుండ కలుగలేదు” (యోహాను 1:1–3).

పౌలు యిలా వ్రాస్తున్నాడు, "ఏలయనగా ఆకాశమందున్నవియు భూమియందున్నవియు దృశ్యమైనవిగాని, అదృశ్యమైనవిగాని, అవి సింహాసనములైనను ప్రభుత్వములైనను ప్రధానులైనను అధికారములైనను, సర్వమును ఆయనయందు సృజించబడెను, సర్వమును ఆయనద్వారాను ఆయననుబట్టియు సృజింపబడెను" (కొలొస్సయులకు 1:16). ఏథెన్స్ వారికి యిలా ప్రకటిస్తున్నాడు, "జగత్తును అందలి సమస్తమును నిర్మించిన దేవుడు తానే ఆకాశమునకును భూమికిని ప్రభువైయున్నందున హస్తనిర్మితములైన ఆలయములలో నివసింపడు" (అపొస్తలుల కార్యములు 17:24). మరియు హెబ్రీ పత్రిక 1:2లో యిలావుంది, "ఈ దినముల అంతమందు కుమారుని ద్వారా మనతో మాటలాడెను. ఆయన ఆ కుమారుని సమస్తమునకు వారసునిగా నియమించెను ఆయనద్వారా ప్రపంచములను నిర్మించెను."[3]

ఈ భౌతిక విశ్వాన్ని దేవుడు సృష్టించాడు, కాబట్టి మీరిలా స్పష్టంగా చెప్పవచ్చు:

(1) *ఈ భౌతిక ప్రపంచం ఎంతోమంచిది.* (ఆదికాండము 1:31 చూడండి.) ఈ పాపం యొక్క ప్రవేశం ద్వారా మానవుల జీవితాలెంతో దుర్భరమైనాయి (ఆదికాండము 3వ అధ్యాయం చూడండి), బాహ్య ప్రపంచం బాగానేవుంది "దేవుడు సృజించిన ప్రతి వస్తువు మంచిది" (1 తిమోతి 4:4ఎ).

(2) *ఈ విశ్వమంతా దేవునిదే.* "భూమియు దాని సంపూర్ణతయు లోకమును దాని నివాసులును యెహోవావే" (కీర్తనలు 24:1; 50:10 చూడుము). ఒక చక్కని సంగీతాన్ని యిలా ఆలాపిస్తారు, అది ఎంతో అర్థవంతంగావుంటుంది "ఇది నా తండ్రి యొక్క ప్రపంచం."[4]

(3) *దేవుడు తన సృష్టిని నియంత్రించుచున్నాడు.* ఆయన ప్రపంచాన్ని చేసి ఏదో నిరాధారంగా వదిలి పెట్టలేదు సుమా.[5] ఆయన "అందరికి జీవమును ఊపిరిని సమస్తమును దయచేయువాడు" (అపొస్తలుల కార్యములు 17:25); మరియు ఆయన "తన మహత్తుగల మాటచేత సమస్తమును నిర్వహించుచున్నాడు" (హెబ్రీయులకు 1:3). వాస్తవానికి "మనమాయనయందు బ్రదుకుచున్నాము, చలించుచున్నము, ఉనికి కలిగియున్నాము" (అపొస్తలుల కార్యములు 17:28; ఎఫెసీయులకు 4:6 చూడుము). దేవుడే సమస్తాన్ని తన శక్తిద్వారా నిర్వహిస్తున్నాడన్న సత్యాన్ని మనం పదే పదే దేవుని నియంత్రణ శక్తియందు మన విశ్వాసం వ్యక్తపరుస్తాము. ఉదాహరణకు, యాకోబు చెప్పినట్టు, "ప్రభువు చిత్తమైతే మనము బ్రదికియుండి ఇది అది చేతుమని చెప్పుకొనవలెను" (యాకోబు 4:15). వర్షం కురిపించమని ప్రార్థించాం.

### ఆకాశములు విశ్వమంతయు దాన్ని సృష్టికర్తను గూర్చి సాక్షమిస్తున్నాయి

దేవుని సృష్టి అంతయు విశ్వమంతయు దాని సృష్టికర్తను స్తుతిస్తూ సాక్ష్యానిస్తుంది. కీర్తనాకారుడిలా అంటున్నాడు, "ఆకాశములు దేవుని మహిమను వివరించుచున్నది అంతరిక్షము ఆయన చేతిపనిని ప్రచురపరచుచున్నది" (కీర్తనలు 19:1). పౌలు కూడా, యిలా వ్రాస్తున్నాడు,

> దుర్నీతిచేత సత్యమును అడ్డగించి మనుష్యుల యొక్క సమస్త భక్తిహీనతమీదను, దుర్నీతిమీదను దేవుని కోపము పరలోకమనుండి బయలుపరచబడుచున్నది. ఎందుకనగా దేవునిగూర్చి తెలియ శక్యమైనదేదో అది వారి మధ్య విశదమైయున్నది; దేవుడు అది వారికి

> విశదపరచెను ఆయన అదృశ్యలక్షణములు, అనగా ఆయన నిత్యశక్తియు దేవత్వమును, జగదుత్పత్తి మొదలుకొని సృష్టింపబడిన వస్తువులను అలోచించుటవలన తేటపడుచున్నవి గనుక వారు నిరుత్తరులై యున్నారు. మరియు వారు దేవుని నెరిగియు ఆయనను దేవునిగా మహిమపరచలేదు, కృతజ్ఞతాస్తుతులు చెల్లింపనులేదు గాని తమ వాదములయందు వ్యర్థులైరి (రోమీయులకు 1:18–21).

ఇంత గొప్ప సృష్టికర్తను గూర్చి లోకమంతా సాక్ష్యమిస్తుంది. సృష్టికర్తను నమ్మకుండ విశ్వసించ కుండ పూజించకుండ సృష్టిని పూజించేవారికి ఏ ఆస్కారం లేదు.

> ఒహో॥ ఇది నా తండ్రి ప్రపంచం,
> పక్షులు కిలకిలా రాగాలు చేస్తున్నాయి;
> ఉదయకాంతి కిరణాలు, తెల్లని విలీపుష్పాలు
> వాటి వాటి కర్తను ఆరాధిస్తున్నాయి.
> ఓహో॥ ఇది నా తండ్రి ప్రపంచం,
> ఆయన ప్రతి దాంట్లో కాంతిపుంజమైయున్నాడు;
> గడ్డిపోచలు సైతం పిల్లవాయుల కదిలికలో స్తుతిస్తున్నాయి,
> ఆయన ప్రతి స్థలంలో నాతో మాట్లాడుచున్నాడు.[6]

## సృష్టియంతటిని మనిషి పరిపాలిస్తున్నాడు

మనిషి, దేవుని యొక్క సృష్టిలో ఒక భాగమై నా మిగతా సృష్టియంతటిని పరిపాలించుచున్నాడు. ఈ సృష్టియంతయు కూడా "మానవ కేంద్రీకృతమై యున్నది." మనిషికంటే ముందుగా చేయబడిన సృష్టియావత్తు మనిషి జీవించడానికి ఈ భూమి మీద సౌకర్యవంతంగా వున్నది. ఈ భూమియంతయు మనిషి కోసమే వున్నది. మనిషి దేవుని సారూప్యములోవున్న సత్యం మనిషిని దేవుడు చేసిన మిగతా సృష్టికి విభిన్నంగా చేస్తుంది. మిగతా సృష్టియంతటిపై మనిషి యొక్క బాధ్యత ఈ విధంగా ఆదికాండము 1:26–28లో సంక్షిప్తపరచబడుచున్నది:

> దేవుడు మన స్వరూపమందు మన పోలికెచొప్పున నరులను చేయుదము వారు సముద్రపు చేపలను ఆకాశ పక్షులను పశువులను సమస్త భూమిని భూమిమీద ప్రాకు ప్రతి జంతువును ఏలుదురుగాకని పలికెను. దేవుడు తన స్వరూపమందు నరుని సృజించెను దేవుని స్వరుపమందు వాని సృజించెను. దేవుడు వారిని ఆశీర్వదించెను; ఎట్లనగా – మీరు ఫలించి అభివృద్ధిపొంది విస్తరించి భూమిని నిండించి దానిని లోపరచుకొనుడి సముద్రపు చేపలను ఆకాశ పక్షులను భూమిమీద ప్రాకు ప్రతి జీవిని ఏలుడని దేవుడు వారితో చెప్పెను.

ఇంకో వాక్యం యిలా చెబుతుంది, "మరియు దేవుడైన యెహోవా నరుని తీసికొని ఏదెను తోటను సేద్యపరచుటకును దాని కాచుటకును దానిలో ఉంచెను" (ఆదికాండము 2:15). ఈలా కొన్ని మానవుడు పరిపాలించడానికి దాని క్షేమం గురించి శ్రద్ధా బాధ్యతలు వహించడానికి బాధ్యుడైయున్నాడు (ఆదికాండము 1:26, 28; 9:1, 2 చూడుము).

ప్రపంచం గురించి శ్రద్ధవహించడానికి మరియు దేవున్ని మహిమపర్చడానికి మనం అడవుల్లో చెట్లుకొట్టేసి మనకు కావలసిన ఆహారపు పంటలు పండించుకుంటాం. జంతువుల చర్మాలు మన వస్త్రాలకోసం చలినుండి మనలను మనం కాపాడు కోడానికి

వాడుకుంటాం (ఆదికాండము 3:21), జంతువుల మాంసన్ని భుజిస్తాం. నదులపై ఆనకట్టలు కట్టి నీటి పారుదల యితర సౌకర్యాలు చేసుకుంటాం కదా! తన సృష్టిని ప్రజలు అనుభవిస్తూ ఆనందిస్తూ ప్రజలు తనను స్తుతించి ఘనపర్చాలని దేవుడు కోరుకొంటున్నాడు.[7]

సృష్టిలోని అనేక సౌకర్యాలు వనరులు అనుభవిస్తూ కేవలం మనం మన క్షేమం గురించే ఆలోచించు కోవడంతో పాటు భవిష్యత్ తరాల మేలు కోసం అలోచించాలి. ఆయన సృష్టియంతటికి మనం గృహనిర్వాహకులమైయున్నాము, అంతయు దేవునిదే అన్న భావం మనలో కలగాలి. ఈ లోక సంపత్తిని ధీర్ఘకాలంగా వినియోగించాడానికి దేవుడు మనిషికి బాధ్యత నిచ్చాడు, కాబట్టి తను వాడుకొనుచున్న వనరుల విషయమైనటువంటి భవిష్యత్ అవగాహన మనిషి కలిగియుండాలి. ప్రస్తుత లోకములోని వనరుల ఉపయోగం పరిణామాల విషయం జాగ్రత్తాగా వ్యవహరించాలి. బైబిల్ ప్రకారం మాట్లాడినట్లయితే ఈ భౌతికలోకాన్ని జాగ్రత్తగా కాపాడడానికి కూడ దేవుడు మనలను తన గృహనిర్వాహకులనుగా వుంచినాడు. మానవ కోటికి మేలుచేయడానికిని, దేవుని మహిమ కరంగా వుండడానికి దేవుడు మనిషికి బాధ్యత నిచ్చాడు.

సరే దేవుడు సృష్టించిన జంతు జాలల సంగతేంటి? జంతువుల లక్షణాలతో భౌతికంగా మనిషి కొంత పంచుకొనినప్పటికి అతడు జంతువులకు విభిన్నంగావున్నాడు. అతడు దేవుని స్వరూపంలో చేయబడినాడు, జంతువులు దేవుని స్వరూపంలో చేయబడలేదు అవన్ని మనుష్యులతో ఏ విధంగాను సమానమైనవి కావు మనుష్యులు వాటిపై అధికారం చెలాయించవలసిందే కాని జంతువుల పట్ల జాలికలిగి వ్యవహరించాలి సుమా! నిర్గమకాండము 23:4, 5 ప్రకారం మనిషి జంతువుల పట్ల జాలిగలిగియుండాలని యున్నది. సంఖ్యాకాండము 22:28–32 భాగంలో గాడిదను నిర్దాక్షిణంగా కొట్టినందుకు బిలాము గద్దింపుకు గురైనాడు. ద్వితీయోపదేశకాండము 25:4లో పని చేస్తున్న గాడిద పట్ల చూపించవలసిన శ్రద్ధను గూర్చి చెప్పబడింది. క్రొత్త నిబంధనలో కొన్ని సార్లు కుక్కలకు మానవులకు మధ్య ఎంతో సాన్నిహిత్యం కొనసాగింది (లూకా 16:21; మార్కు 7:26–28). దేవుని సృష్టిలో రెండవ స్థాయిలో వున్న జంతువులను ఎలా చూస్తామో అనేది మనం మనతోటి మనుష్యులను ఎలా గౌరవిస్తున్నామో అన్నది నిర్ధారిస్తుంది. అంతే కాదు మనుష్యుల పట్ల శ్రద్ధ చూపినంతగా జంతువుల పట్ల శ్రద్ధ చూపరాదు. జంతువులను చంపి తినడానికి దేవుని నుండే అనుమతియున్నది (ఆదికాండము 9:3; అపొస్తలుల కార్యములు 10:13). దానికి భిన్నంగా మనుష్యులను చంపుట హత్య అవుతుంది.

## సృష్టి పూజింపబడుటకు కాదు

పౌలు యిలా అంటున్నాడు, "దుర్నీతి చేత సత్యమును అడ్డగించు మనుష్యుల యొక్క సమస్త భక్తిహీనతమీదను, దుర్నీతిమీదను దేవుని కోపము పరలోకమునుండి బయలుపరచబడుచున్నది" (రోమీయులకు 1:18) మరియు "ఎందుకనగా దేవుని గూర్చి తెలియ శక్యమైనదేదో అది వారి మధ్య విశదమైయున్నది; దేవుడు అది వారికి విశదపరచెను" (రోమీయులకు 1:19). ఇంకా యిలా అన్నాడు,

> మరియు వారు దేవుని నెరిగియు ఆయనను దేవునిగా మహిమపరచలేదు, కృతజ్ఞతాస్తుతులు చెల్లింపనులేదు గాని తమ వాదములయందు వ్యర్థులైరి. వారి అవివేక హృదయము

అంధకారమాయెను; తాము జ్ఞానులమని చెప్పుకొనుచు బుద్ధిహీనులైరి. వారు అక్షయుడగు దేవుని మహిమను క్షయమగు మనుష్యుల యొక్కయు, పక్షుల యొక్కయు, చతుష్పాద జంతువులయొక్కయు, పురుగులయొక్కయు, ప్రతిమాస్వరూపముగా మార్చిరి.

ఈ హేతువుచేత వారు తమ హృదయముల దురాశలను అనుసరించి, తమ శరీరములను పరస్పర అవమాన పరచుకొనునట్లు దేవుడు వారిని అపవిత్రతకు అప్పగించెను. అట్టివారు దేవుని సత్యమును అసత్యమునకు మార్చి, సృష్టికర్తకు ప్రతిగా సృష్టమును పూజించి సేవించిరి. యుగముల వరకు ఆయన స్తోత్రార్హుడై యున్నాడు, ఆమేన్ (రోమీయులకు 1:21-25).

అలాంటి ప్రజలు ఆయనను గౌరవించలేదు కాబట్టి "దేవుడు వారిని" పాపానికి వదిలి పెట్టనాడు (రోమీయులకు 1:26-32). మనుష్యులు చేయవలసిందల్లా ఏమంటే సృష్టికర్తను పూజించడం, ఆయనను సేవించడం మాత్రమే గాని సృష్టిని కాదు. తరచుగా ప్రజలు సృష్టిని పూజించడానికి పూనుకుంటున్నారు.

## సృష్టింపబడిన ప్రపంచమంతా అప్పటినుండి అలాగే నిలిచి లేదు

మనకు కనిపిస్తున్న సృష్టించబడిన భౌతిక ప్రపంచం విశ్వమంతా అలాగే లేదు, ఆత్మీయ ప్రపంచంకూడ ఉనికిలో వున్నది. దేవుడు ఆత్మయైయున్నాడు (యోహాను 4:24). దేవదూతలు ఉనికి కల్గియున్నారు, యిక అదే మాదిరి సైతాను దురాత్మలువున్నాయి. మానవులంతా మనం శరీరకంగా భౌతిక దేహాలతోయున్నప్పటికి ఆత్మీయ వ్యక్తులంగా వున్నాము (2 కొరింథీయులకు 4:16; 5:1); మరణం తరువాత కూడ ఈ ఆత్మ కొనసాగుతుంది. లాజరు ధనికుడు మరణించినప్పుడు అంతటితో వారు అంతరించిపోలేదు. ధనవంతుడు నరకంలో నరక యాతన పడుతూ వుండడం, లాజరు అబ్రాహాము రొమ్మున ఆనుకొనియుండడం చూడగలం (లూకా 16). మరణం తరువాత ప్రజలు ఆత్మీయ ప్రపంచంలో జీవిస్తునేవుంటారు.

పరలోకము నిజమైనది, నరకం కూడా అంతే ఈ భౌతికలోకంలో జీవించినంత కాలం జీవిస్తాం యిక మరణం తరువాత మనం ఉండం, మన ఉనికి లేదని భావించేవారు (అంటె ధనవంతుని వలె లూకా 16 అధ్యాయంలో) యిప్పటికే చాలాకాలం వృథా చేశారు, కాలం దాటిపోతే యిక రాదని గ్రహించాలి!

## సృష్టించిన విశ్వమంతా గతించి పోతుంది

దేవుడు ఈ సృష్టిని నిర్మించాడు, అదే భౌతిక విశ్వం కొన్నాళ్ళకు అంతరించి పోతుంది దాని స్థానంలో "క్రొత్త ఆకాశం క్రొత్త భూమి" నిలుస్తుంది. పేతురు యిలా రాస్తున్నాడు, "అయితే ప్రభువు దినము దొంగవచ్చినట్లు వచ్చును ఆ దినమున ఆకాశములు మహాధ్వనితో గతించి పోవును పంచభూతములు మిక్కుటమైన వేండ్రముతో లయమైపోవును భూమియు దానిమీదనున్న కృత్యములును కాలిపోవును" (2 పేతురు 3:10). యోహాను కూడా దర్శన రూపంగా చూచాడు, "అంతట నేను క్రొత్త ఆకాశమును క్రొత్త భూమిని చూచితిని మొదటి ఆకాశమును మొదటి భూమియు గతించిపోయెను. సముద్రమును ఇకను లేదు" (ప్రకటన 21:1). కొత్త ఆకాశము కొత్త భూమి అంటే పాత భూమి తిరిగి పునర్ నిర్మితమవుతుందని కాదు సుమా! దానికి విభిన్నంగా కొత్త ఆత్మీయతా విశ్వం నిరంతరం నిత్యంగా నిలిచి యుంటుంది.

## ముగింపు

ఈ భౌతిక విశ్వమంతా దేవుని మహిమార్థమే సృష్టించబడిందని మనం నమ్ముతాం ఈ విశ్వాన్ని కాపాడుతూ దేవుని ఘనపరుస్తు తోటి మానవాళికి మేలుకరంగా జీవించడమే మనిషియొక్క బాధ్యతయైయున్నది. ఏదో మన కళ్లకు కనిపించే విశ్వం మాత్రమే ఉనికి కలిగిలేదు, ఆత్మీయ ప్రపంచం కూడ ఉనికిలో వున్నది సుమా! ఈ భౌతిక పరమైన విశ్వం నశించిపోతుంది ఆత్మీయ లోకం శాశ్వత కాలముంటుంది.

ఈలాంటి ఉద్దేశాలు అందరూ పంచుకోరు. ప్రజలు ఏదో సహజాతీతమైన భావాలు ఈ విశ్వం గురించి కలిగియున్నారు. దేవునియొక్క ఉనికినే శంకిస్తున్నారు. ఆయన సృష్టి విధానాన్ని కూడ వ్యతిరేకిస్తున్నారు. ఇలా ప్రజలు దేవుని నుండి దూరంగా వుంటు ఏదో సహజాతీత వివరణలు ఏవేవో యిస్తూ ఈ భౌతిక ప్రపంచ నిర్మాణ విధానాన్ని వక్రీకరిస్తూ ఎగతాళి చేసినంత పని చేస్తున్నారు. మనం సృష్టిని మాత్రం ఏమాత్రం ఆరాధించకూడదు, సృష్టి ఆరాధింపబడ కూడదు అంతేగాని సృష్టిని పరామర్శించి కాపాడాలి అంటె దేవుడు మనకనుగ్రహించిన బాధ్యత అది.

ఇది నా తండ్రి యొక్క ప్రపంచం,
ఓ … దాన్నెన్నటికి నేను మరువకుందును
తప్పు అనునది బలమైనదిగా కనబడినను,
దేవుడు సమస్తమునకు ఏలికైయున్నాడు.[8]

---

సూచనలు

[1]ఆత్మీయమైన లేక అస్వాభావికమైన ప్రపంచం మరియు పరలోకం, దేవదూతలు, దేవుని ద్వారా సృష్టించబడ్డాయి కొలొస్సయులకు 1:16 చూడు. [2]శూన్యంలో నుండి (*ex nihilo*) దేవుడు అన్నింటిని సృష్టించాడు (హెబ్రీయులకు 11:3). దేవుడు గనుక ప్రపంచాన్ని ఏదొకొంత పదార్థంతో చేస్తే అంటే అంతకు ముందేవున్న దాని నుండి అని అంటే పదార్థము నిత్యంగా దేవునితోనే యున్నది అని అర్థం అంటే పదార్థం కూడ దేవునితో సమానం. [3]అపొస్తలుల కార్యములు 4:24; 14:15; 17:24, 25; హెబ్రీయులకు 11:3; ప్రకటన 4:11; 10:6 చూడుము. [4]Maltbie D. Babcock, “This Is My Father’s World,” *Songs of Faith and Praise,* comp. and ed. Alton H. Howard (West Monroe, La.: Howard Publishing Co., 1994). [5]దేవుడు వున్నాడు, అయితే ఆయన మానవుల వ్యవహారాల్లో జోక్యం లేకుండవున్నాడు సరే – ఆయనైతే లోకాన్ని చేశాడు కాని దాని కదే కొనసాగునట్లు దాన్ని వదిలేశాడు. దీన్నే – డీయిజం అంటారు. [6]Babcock. [7]ప్రజలు ఈ లోకంలో ఏదైనా సాదించినట్లయితే వారొక విషయం గుర్తుంచుకొవాలి. అంటే గొప్ప విషయాలు కనిపెట్టడం, లేదా గొప్ప గొప్ప కట్టడాలు నమూనా సిద్ధం చేయడం లేదా నిర్మించడంలాంటివి. గొప్ప గొప్ప శాస్త్రజ్ఞులు సైతం, గొప్ప విషయా నూతన కల్పన చేయువాడు సైతం దేవుడు ఈలోకంలో దాచియుంచిన నిక్షేపాలను మాత్రమే వాడుకుంటారు, అందుచేత వారు సాధించిన దాన్ని బట్టి దేవునికి మాత్రమే ఘనతా ప్రభావాలు చెల్లించాలి. (యాకోబు 1:17 చూడు.) [8]Babcock.